# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

97
ధారావాహిక



**జరిగిన కథ :** ప్రకృతి పిచ్చెక్కినట్లు ఊగిపోతున్న బీభత్స వాతావరణంలోనే.. నంగెగడ్డరేవుకు చేరాడు జాయపుడు. ముందే వచ్చి ఇసుకగుట్టపై కూర్చుని ఉన్నది మువ్వ. ఇద్దరూ మాటల్లో ఉండగానే.. నల్లని మబ్బులు దట్టంగా కమ్ముకున్నాయి. రాబోయే ముప్పును గుర్తించింది మువ్వ. ఉప్పెన వచ్చేటట్టున్నదనీ, జాయపుణ్ని రేవులోకి దూకమని చెప్పి.. తానుకూడా నీళ్లలోకి దూకేసింది. క్షణక్షణానికీ ఉగ్రరూపం దాల్చిన కృష్ణమ్మ.. ఆ ఇద్దరినీ వేగంగా లాక్కుపోతున్నది. వారితోపాటు కొమ్మలు, చెట్లు.. గడ్డీ గాదం, గేదెలు, దూడలు, ఆవులు.. సుళ్లు తిరుగుతూ మునిగి - తేలుతూ సాగిపోతున్నాయి. ఊహాతీతంగా ఇద్దరూ ఒక చెట్టు పైకి చేరారు. ప్రత్యూష వేళకు కిందికి చూసి కొయ్యబారిపోయాడు జాయపుడు.

జాయపుడు, మువ్వ ఇద్దరూ కూర్చున్నది.. ఆకాశమంత ఎత్తున్న తాడిచెట్టు పైన. ఇద్దరి చేతులమధ్య గోపయ్య బొమ్మ. కింద.. వేగంగా పోతున్న కృష్ణమ్మ. ఆమె ఉరవడిలో పోతున్న శవాలైన మనుషులు, జంతువులు, చెట్లు చేమలు, గొడ్డు గోదా!

ఆ ఇద్దరూ.. తెల్లవార్లు నీటిలోనే.. ఆ తాడిచెట్టుపైనే.. నాలుగైదు గంటలు అలాగే ఉండిపోయారు. పిచ్చికేకలు వేసినా పలికే దిక్కులేదు. మధ్యాహ్నం మూడోజాము వేళకు నీరు వచ్చినంత వేగంగా తగ్గిపోయింది. మనుషులు కనిపిస్తున్నారు. బతికి ఉన్నవాళ్లు ఏడుస్తూ.. అంతా వెతుకుతున్నారు.

అప్పుడు చెట్టు పైనుంచి పెద్దగా అరవసాగాడు జాయపుడు. పైకి చూసిన కొందరు పోగయ్యి.. కల్లుగీసే గౌడును పిలిపించి, చర్చించి ఇద్దరినీ మోకుతాళ్లతో కట్టి కిందికి దించారు. నీటివెంట దొర్లుకుంటూపోతూ చెట్లకు తగిలి.. ఒళ్లంతా ముళ్లు గుచ్చుకుని.. ఇద్దరూ రెండు మాంసపు ముద్దలుగా మిగిలారు. ఎవరో అడిగారు..

''సచ్చి బతికారు.. ఏ ఊరు బాబూ మీది?''.

''మాది.. మాది నంగెగడ్డ. ఇదే ఊరు?'' నీరసంగా దిక్కులు చూస్తూ అడిగింది మువ్వ.

''కూసెనపూండి అగ్రహారం మాదిగవాడ''.

''ఓయమ్మో.. అంటే మనం నంగెగడ్డ నుంచి పోయి పోయి పదియోజనాలు దిగువకు పోయి పడ్డాం..'' అన్నది మువ్వ.

ఈ ఊరెక్కడో జాయపునికి ఇదమిత్థంగా తెలియదు కానీ, చాలాదూరం వచ్చినట్లు గుర్తించాడు.

* * *

కృష్ణమ్మ ఉగ్రరూపం ఎలా ఉంటుందో మొదటిసారి చూసిన జాయపుడు దిమ్మెరపోయాడు. కానీ, ద్వీపవాసులకు ఇలాంటివి మామూలే! తుఫానులు, వరదలు, వాయుగుండాలు వస్తుంటాయి. వందలమందిని తీసుకుపోతుంటాయి. తక్కువ నష్టంతో కృష్ణమ్మ, సముద్రుడు శాంతిస్తే అదే పెద్ద ఊరట.